క్లుప్తంగా

వచ్చే ఎన్నికల్లో వార్ వన్ సైడే

కురబలకోట: రానున్న ఎన్నికల్లో వార్ వన్‌సైడ్‌లా ఉంటుందని సీఎం జగన్‌ను రెండో సారి సీఎంగా చూసుకోడానికి రాష్ట్ర ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. పలమనేరులో వాల్మీకి జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కర్నూలు వెళుతున్న ఆయనను రిషివ్యాలీ క్రాస్ వద్ద తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కలుసుకున్నారు. మంత్రిని ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ జగన్ చేసిన మంచి పనులే గెలిపిస్తాయన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి

రామసముద్రం : రామసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పోలీస్ అమరవీరుల దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కడప 11వ బెటాలియన్ కెవిరమణ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ రామసముద్రం స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శాంతకుమారి భర్త రమేష్ హైదరాబాద్ శాలిబండ దగ్గర ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందారన్నారు. ఆయన జ్ఞాపకార్థంగా పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే వ్యాసరచన పోటీల్లో విజేతలకు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌రమణ, ఎస్‌ఐ చంద్రశేఖర్, హెచ్‌ఎం చిట్టిబాబు బహుమతులు ప్రదానం చేశారు.

సర్వేయర్‌పై ఫిర్యాదు

పీలేరు : భూమి సర్వే చేయడానికి లంచం అడుగుతున్నాడని సర్వేయర్ రెడ్డెప్పపై బాధిత రైతు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ పెద్దిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు సునీల్‌కుమార్‌రెడ్డి తన భూమి సర్వే చేయడానికి మూడు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. రెండు నెలల తరువాత సర్వే చేశారు. సర్వేయర్ రెడ్డెప్ప సర్వే చేసిన రిపోర్టు ఇవ్వడానికి లంచం డిమాండ్ చేయడంతో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. తహశీల్దార్ స్పందించకపోవడంతో శనివారం మరో సర్వేయర్ వద్దకు వెళ్లి రిపోర్టు కోరగా, ఆయన దుర్భాషలాడినట్లు రైతు సునీల్‌కుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే పలువురు రైతులు సర్వేయర్‌పై ఫిర్యాదు చేశారు.

10లీటర్ల సారా పట్టివేత

కలకడ : పది లీటర్లు సారా సీజ్ చేసి వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సిటిస్వామి తెలిపారు. శనివారం మండలంలోని రాతిగుంటపల్లె పంచాయతీ కోన క్రాస్ వద్ద కోన గ్రామానికి చెందిన ఇమాంమ్‌సాబ్ కుమారుడు సాబ్‌జాన్ సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. సాబ్జాన్‌వద్ద విక్రయించడానికి సిద్ధంగాఉన్న 10లీటర్లు సారాను సీజ్ చేసి సాబ్‌జాన్‌ను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

బి.కొత్తకోట : కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి శనివారం తెలిపారు. బి.కొత్తకోటకు చెందిన నారాయణమ్మ (40) కర్ణాటక టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడులు నిర్వహించి అరెస్ట్ చేశామని తెలిపారు. ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది మునిరామయ్య, రూపకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

వాల్మీకిపురం : స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు జువాలజీ విభాగం సహకారంతో ఎన్‌ఎస్‌ఎస్‌ఆర్‌ఆర్‌సి ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి తెలిపారు. విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించి, వారి బ్లడ్ గ్రూప్ నిర్ధారణ తెలియజేశారని తెలిపారు. రాఘవరెడ్డి, సుదర్శన్, జ్యోతి, విజయలక్ష్మి, నారాయణస్వామి పాల్గొన్నారు.

వీఆర్‌ఓకు ఆర్థికసాయం

పీలేరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయాలో చికిత్సపొందుతున్న వీఆర్‌వోకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. మేళ్లచెరువు వీఆర్వో వెంకటరమణ వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న అరుణ్‌కుమార్‌రెడ్డి తనవంతు సాయంగా ఆర్థిక సాయాన్ని శనివారం ఏఎస్‌వో రామ్మోహన్, డీటీ సుబ్రమణ్యంకు అందజేశారు.

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

తంబళ్లపల్లె : నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.నియోజకవర్గంలో 1,05,984 పురుషులు, 1,08,566 మహిళా ఓటర్లు, 10 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు. పార్టీల నాయకులు, ఓటర్లు ఆ జాబితాను పరిశీలించి తప్పులు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండే యువకులు డిసెంబర్ 9లోగా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

బి.కొత్తకోట : ఈనెల 31న జరిగే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ నియోజకవర్గ అధ్యక్షులు సలీంబాషా కోరారు. శనివారం జరిగిన సంఘ సమావేశంలో మాట్లాడుతూ స్థానికంగా రెండుచోట్ల వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, ఆదినారాయణ, షఫీ, గంగులప్ప, జవహర్, రమేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పీలేరు ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి



యర్రయ్యగారిపల్లెలో ఉచిత విద్యుత్ మీటర్‌ను అందజేస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి

కలకడ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందించే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని పీలేరు ఎమ్మెల్యే చింతల. రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలోని కాలనీ, యర్రయ్యగారిపల్లె గ్రామాలలో ఇంటింటిని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలియజేశారు. దేవళంపేట కాలనీలో మురుగనీటికాలువలు, వీదిదీపాలు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే మంజూరుకు సిఫారస్సు చేశారు. రెండు గ్రామాలలోని 18మంది ఇల్లు కావాలని కోరగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలకడ కస్తూరి భాగాంధీబాలికలగురుకులపాఠశాలలో నీటిబోరు మోటార్ మరమ్మత్తుకు గురైనట్లు, నీటికోసం బాలికలు అవస్థలు పడుతున్నట్లు ఆపాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయునిలు తెలియజేయగా స్పందించిన ఎంపీపీ శ్రీదేవి వారంలోపు మోటార్ ఏర్పాటు చేస్తాని ఎమ్మెల్యే దేశాల మేరకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి,రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ ఖలీం, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, మండల ఆర్‌బికెచెర్మెన్ హరినాథరెడ్డి, మైనార్టీ నాయకులు షావత్‌అల్లీఖాన్,మండల సచివాలయాల కన్వీనర్ మోహన్‌రాజ్,బాలయ్యగారిపల్లె సచివాలయ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి,ఆర్‌వి,సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ మీటర్లును సద్వినియోగం చేసుకోవాలి..

మండలంలో జగనన్న కాలనీలో ఇంటినిర్మాణం చేపట్టిన వారికి ఉచితంగా విద్యుత్ సర్వీస్, మీటర్లు విద్యుత్ శాఖ ద్వార పొంది, ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ సర్వీసులను గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి కోరారు. యర్రయ్యగారిపల్లెలో జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ మీటర్లు పంపిణీ చేశారు.

వడ్డెరుల చైతన్యసభను విజయవంతం చేయండి



వడ్డెరుల చైతన్యసభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పీలేరు రూరల్ : నవంబర్ 8న పీలేరు మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించనున్న వడ్డెరుల చైతన్యసభను విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ కోరారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో వడ్డెర చైతన్య సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ముఖ్య ఉద్దేశంగా చైతన్యసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైతన్య సభకు పాకలకోట పీఠాధిపతి ఇమడి సిద్ధరామేశ్వరస్వామి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డితోపాటు రాష్ట్ర స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. వడ్డెర సంఘం నాయకులు సి. బాలరాజు, బి. రమణ, కె. చంద్రయ్య, డి. రమణ, ఎ.వి. రమణ, టి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

కలికిరి: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ముస్లిం మైనారిటీలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. కలికిరి పట్టణంలోని ఉర్దూఅకాడమి కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందినుద్దేశించి మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో మైనారిటీలకు సుమారు వంద కోట్లకు పైగా లబ్ది చేకూరినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 11న నంద్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి మైనారిటీ సంక్షేమ దినోత్సవం జరుగనుందని, కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు. రాష్ట్రం నలుమూల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాల్సి ఉందన్నారు. కంప్యూటర్ శిక్షణా కేంద్రం ఇన్‌చార్జ్ నాజియా, ఉర్దూ గ్రంథాలయ అధికారి జావీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

సీస్ నమూనా పరీక్ష నిర్వహణ



నమూనా పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : పాఠశాలల్లో నవంబర్ 3న నిర్వహించే స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్షల్లో ప్రతిభ కనబరచాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పాఠశాలల ఆవరణంలో ఆరు, 9వ తరగతి చదివే విద్యార్థులకు సీస్ నమూనా పరీక్షలను నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుతత్వాలు ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో నవంబర్ 3న నిర్వహించే పరీక్షల ద్వారా విద్యార్థుల అభ్యసనా స్థాయి మదింపు వేయడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ఫణీంద్ర, సుధాకర్ నాయుడు, రసూల్‌బావాజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయం నీళ్లపాలు!

- అక్రమ కుళాయిలతో ఆదాయానికి గండి
- సమగ్ర సర్వేతో లెక్క తేల్చేందుకు నిర్ణయం

బి.కొత్తకోట: నీటి కొళాయిల విషయంలో బి.కొత్తకోట నగర పంచాయతీలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఉన్న జనాభా, నివసిస్తున్న కుటుంబాల ఆధారంగా సరఫరా చేస్తున్న నీటికి, ప్రజలు పొందిన ప్రైవేటు కొళాయిల సంఖ్యకు పొంతన కుదరడం లేదు. కమిషనర్ పీఆర్. మనోహర్ ఒక్కో విభాగం పనితీరును పరిశీలిస్తూ లోటుపాట్లను సరిచేస్తున్నా రు. ఇందులో భాగంగా తాగునీటి సరఫరా వ్యవస్థపై చేపట్టిన పరిశీలనలో అవాక్కయ్యే విషయాలు వెలుగులోకి వచ్చాయి.

1,241 కొళాయిలే ఉన్నాయట

నగర పంచాయతీ పరిధిలో అధికారికంగా 7,503 గృహాలు ఉన్నట్టు లెక్క ఉన్నప్పటికి అనధికారికంగా జరిగిన నిర్మాణాలు పరిగణలోకి తీసుకుంటే ఇళ్ల సంఖ్య 8వేలకుపైగా ఉంటాయని అంచనా. నగర పంచాయతీ పరిధిలో 1,241 ఇళ్లకు మాత్రమే కొళాయి కనెక్షన్లు ఉన్నట్టు లెక్క ఉంది. సచివాలయం-1 పరిధిలో 185, సచివాలయం-2 పరిధిలో 292, సచివాలయం-3 పరిధిలో 506, సచివాలయం-4 పరిధిలో 223, సచివాలయం-5 పరిధిలో 235 ప్రయివేటు కొళాయిలు ఉన్నట్టు లెక్క తేల్చారు. ఈ లెక్క కూడా తప్పినట్టు అధికారులు భావిస్తూ..దీనికి మించి ప్రైవేటు కొళాయిలు అంచనా వేస్తున్నారు.

అక్రమ లెక్క పెద్దదే

నగర పంచాయతీ పరిధిలో అనుమతిలేని కొళాయిల సంఖ్య పెద్దగానే ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. నిధులు సమకూర్చుకునే ప్రయత్నాల్లో భాగంగా అధికారులు దీనిపై చర్యలు చేపట్టారు. కొళాయిలను క్రమబద్ధీకరించి, నీటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకొంటున్నారు. దీనిపై శుక్రవారం కమీషనర్ పీఆర్.మనోహర్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి అక్రమ కొళాయిలపై చేపట్టాల్సిన సర్వే, సేకరించాల్సిన వివరాలపై అవగాహన కల్పించారు.

సమగ్ర సర్వే

నగర పంచాయతీలోని ఐదు సచివాలయాలకు చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నీటి సరఫరా వ్యవస్థపై పట్టు పెంచుకోవాలని ఆదేశాలిచ్చాం. అక్రమ నీటి కొళాయిలపై సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటాం. కొత్తగా కనెక్షన్ కావాల్సిన వారు జనరల్ ట్యాప్‌కు రూ.7,500, ఓవైటీ ట్యాప్‌కు రూ.13,500, రోడ్ కటింగ్ చార్జేస్ చెల్లించాలి. అక్రమ కొళాయిలను ప్రజలు క్రమబద్ధీకరించుకోవాలి.

-పీఆర్.మనోహర్, కమిషనర్, బి.కొత్తకోట

సక్రమంగా రికార్డుల నిర్వహణ

తంబళ్లపల్లె : అంగన్‌వాడీ కేంద్రాలలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మీ సూచించారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో రేణుమాకులపల్లె సెక్టార్‌పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం జరిగింది. నెలవారి నివేదికలను పరిశీలించారు. కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని లబ్దిదారులకు సకాలంలో సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యకర్తలు కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల ప్రేమ చూపుతూ వారి ఆసక్తి అనుగుణంగా ఆటలు,పాటలు, బొమ్మలతో బోధన చేయాలన్నారు.

మనిషికి ఆరోగ్యమే మహా భాగ్యం

కురబలకోట : మనిషి జీవితంలో అసలైనది చివరి వరకు తోడుగా ఉండేది ఒక్క శరీరమేనని సిరిసంపదలు దీనికి సాటిరావని కురబలకోట ఎంపీపీ బి. దస్తగిరి, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం పిచ్చలవాండ్లపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మనిషి జీవితం మహా ప్రస్థానమన్నారు. ప్రాణాయామం, ధ్యానం, వ్యాయామం , వాకింగ్, పోషక ఆహారంతో పాటు కర్తవ్య కర్మలను అనుసరించాలన్నారు. అప్పుడే రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉండగలరన్నారు.

సచివాలయ సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలి

కేవీపల్లె : విధినిర్వహణలో గ్రామ సచివాలయ సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలని ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ అన్నారు. శనివారం మండలంలోని వగళ్ల గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం గ్రామ సమీపంలో చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల స్థల పరిశీలన

రామసముద్రం : మండల కేంద్రంలో టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపకదళం విద్యుత్‌శాఖాధికారులతో కలసి శనివారం పరిశీలించారు. అధికారులు, దుకాణాదారుల యజమానులతో మాట్లాడుతూ వ్యాపారస్తులు దుకాణం దుకాణంకు మధ్య మూడు మీటర్లు దూరం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాలన్ని ఎల్‌ఆకారంలో ఉండాలని అగ్నిమాపక , విద్యుత్‌శాఖకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి జి.శివప్ప, ఆర్‌ఐ నాహరాజు, వీఆర్‌వోలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు దీపోత్సవం

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం కదిరి రోడ్డులో వెలసిన మహబూబే సుబహాని దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం దీపోత్సవ కార్యక్రమం నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఆవరణం మొత్తం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

వైభవంగా మహాపూర్ణాహుతి



తిరువీధి ఉత్సవంపై విహరిస్తున్న పట్టాభిరాముడు

వాల్మీకిపురం : టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, పవిత్ర వితరణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్ర వితరణం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి వీధి ఉత్సవం కన్నులపండువగా సాగింది. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, సిబ్బంది క్రిష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అండగా జగనన్న సురక్ష



రోగులకు ఆరోగ్యసురక్ష కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నిమ్మనపల్లె : ప్రజారోగ్యానిక అండగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిలుస్తోందని ఎంపీపీ నరసింహులు అన్నారు. శనివారం మండలంలోని తవళం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరళ్ సదాశివారెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రమణారెడ్డి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య బృందం ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి,వైస్ ఎంపీపీ జయప్రకాష్ రెడ్డి, ఎంపిడిఓ శేషగిరారావు, తహశీల్దార్ మంజుల, మెడికల్ ఆఫీసర రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి జగనన్న భరోసా

బి.కొత్తకోట : నిరుపేదల వైద్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష భరోసా ఇస్తుందని తహసీల్దార్ ఎస్.రఫీక్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని పులుసుమానిపెంటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం పొందలేని పేదలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అండగా ఉండగా ప్రస్తుతం వైద్యులు, వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్నారని ఇది వైద్య విప్లవమని అన్నారు. హాజరైన ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. ఎంపీడీఓ శంకరయ్య, సర్పంచు సరస్వతి, ఎంపీటీసీ ఎ.గౌతమి శివారెడ్డి, ఉపసర్పంచు వేణుగోపాల్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు అరుణ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

ముగిసిన హస్తకళ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

మదనపల్లె : రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో పేస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు శనివారం ముగిసింది. కార్యక్రమంలో జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, అలిండియా హస్తకళల బోర్డు మాజీ సభ్యుల వి.ఎస్.రెడ్డిలు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన అవగాహన సదస్సులో దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు హస్తకళల పట్ల అవగాహన కలిగించడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి, పేస్ సంస్థ నిర్వాహకులు శ్రావణ్‌రెడ్డి, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి తనిఖీపై గ్రామసభలు

పెద్దతిప్పసముద్రం : మండలంలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల 7 వరకు ఉపాధి హామీ పనులపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, ఏపీవో తిరుపాలప్ప తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 31న మండలంలోని కందుకూరు, మల్లెల, వచ్చే నెల 1న సంపతికోట, మడుమూరు, రంగసముద్రం, 2న తుమ్మరకుంట, 3న అంకిరెడ్డిపల్లి, 4న రాపూరివాండ్లపల్లి, మద్దయ్యగారిపల్లి, టి.సదుం, 7న పట్టెంవాండ్లపల్లి, బూర్లపల్లి, పులికల్లు, పీటీఎం, బూచిపల్లి పంచాయతీ కేంద్రాల్లో గ్రామసభలు జరుగుతాయని ఆయా గ్రామాల్లో జరిగిన పనులు, ఖర్చు చేసిన నిధులను సామాజిక తనిఖీ బృందం చదివి వినిపిస్తారన్నారు. ఎస్ఆర్‌పీ భాస్కర్ నేతృత్వంలో ఆరు మంది డీఆర్పీలు, విలేజ్ అసిస్టెంట్లు తనిఖీలో పాల్గొంటారని అనంతరం 8వ తేదీన సామాజిక బహిరంగసభ జరుగుతుందన్నారు.

వేడుకగా వాల్మీకి జయంతి ఉత్సవాలు



పెద్దతిప్పసముద్రంలో వాల్మీకి జయంతి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

మదనపల్లె : మదనపల్లెలో పలు చోట్ల వాల్మీకి (బోయ) కులస్తులు పార్టీలకు అతీతంగా వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షులు పాదల నరసింహులు ఆధ్వర్యంలో చిత్తూరు బస్టాండు వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ సాధన డిమాండ్‌ను ప్రభుత్వం తీర్చేందుకు, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. పాదల నరసింహులు మాట్లాడుతూ వాల్మీకి జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు మాలతి మాట్లాడారు. నాయకులు క్రిష్ణమూర్తి, కృష్ణమూర్తి, శంకర, సరోజమ్మ, గౌరమ్మ, కమలమ్మ, గిరిధర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

వాల్మీకిపురం : వాల్మీకి మహర్షి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చింతపర్తి, వాల్మీకిపురంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడారు. మెంబరు శీన, శ్రీరాములు, గుర్రప్ప, రామక్రిష్ణా, ఫణికుమార్, రెడ్డెప్ప, రమణ, శ్రీనాథ్, శ్రీనివాసులు, సదా పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి

పెద్దతిప్పసముద్రం : వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయుడని స్థానిక మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బి.కొత్తకోటలో వాల్మీకి జయంతి

బి.కొత్తకోట : వాల్మీకి జయంతి వేడుకలు శనివారం బి.కొత్తకోటలో ఘనంగా నిర్వహించారు. జ్యోతిచౌక్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. వాల్మీకి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చావడి కిట్టన్న, సంఘ నాయకులు మంజునాథ్, రెడ్డెప్ప, సూరి, ప్రకాష్, నరసప్ప, శంకర పాల్గొన్నారు.

నిమ్మనపల్లె: మండల పరిధిలోని వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకి సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. శనివారం మండలంలోని దిగువపల్లిలో యువజ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీపీ నరసింహులు, వైస్‌ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, రమణారెడి హాజరయ్యారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన నేతలు

మదనపల్లె: అర్హత ఉన్నత ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ రెడ్డిగానిపల్లె, గుండవారిపల్లె,కాలనీ తదితర గ్రామాల్లో సర్పంచు బోర్‌వెల్ మహేష్‌తో కలిసి ఇంటింటికి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ది వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. అయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకా చలపతి, వెలుగు చంద్ర, మార్కెట్ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, జెసీఎస్ కన్వీనర పోతబోలు నాగరాజు, వైస్ సర్పంచు మల్లికార్జున, క్రిస్టియన్ సెల్‌జిల్లా అధ్యక్షులు జాన్‌బాబు, తహశీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపిడిఓ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాయిని..జగనన్న సురక్ష

పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆరోగ్య ప్రదాయనిగా మారిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 8,9వ వార్డు సచివాలయ పరిధిలోని సుభాష్‌వీధిలోని రామారావు ప్రాథమక ఉన్నత పాఠశాలలో, మండలంలోని మాలేపాడు సచివాలయ ఆవరణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను శనివారం ఆయన పరిశీలించారు. శిబిరానికి హాజరైన ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయా? డాక్టర్లు బాగా చూస్తున్నారా.. పరీక్షలు ఉచితంగా చేశారా? మందులు ఇచ్చారా అంటూ అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకా చలపతి, సర్పంచు గణేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ప్రభావతి, ఎంపీటీసీ ఈశ్వరమమ్మ, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, వెలుగు చంద్ర, కౌన్సిలర్లు పాల్గొన్నారు.